# నిండుహృదయాలు

శ్రీ బి. రామనాథ్

'సీత యేది? మామ్మా?' యింటికి వచ్చి రావడంతోనే ప్రశ్నించాడు నారాయణ బూట్లయినా విప్పకుండానే.

'ఏదీ? యింట్లో లేదూ?' అని దీర్ఘంతో సమాధానం యిచ్చింది ముసలమ్మ.

'ఏంచేస్తున్నది?' అంటూ బూట్లు విప్పి త్వరత్వరగా ఆఫీస్ డ్రెస్ విప్పేసి ధోవతి కట్టుకొని లోపలకు వెళ్లాడు...

'సీతా?' మధ్య యింట్లోనుండి అతను వేసిన యీ చిన్న కేకకు అక్కడె తొంగ్లాడుతున్న పిల్లికూన అదిరిపడి గోతాలచాటున నక్కింది. కాని రావలసినచోటునుండి సమాధానం రాకపోవడంచేత అసందిగ్ధమైన మనస్సుతో వంటింట్లో ప్రవేశించాడు నారాయణ. అక్కడా లేదు, సీత.

అతడి ఆశ్చర్యం యింతా అంతా కాదు. దొడ్లోకి వెళ్లి కాళ్లూచేతులూ కడుక్కుని టవల్‌తో తుడుచుకున్నాడు...

'ఎక్కడికి వెళ్లివుంటుంది సీత?' అని ఆలోచిస్తూ యీజీచైర్లో వడుంవాల్చాడు నారాయణ. చేతుల్లో పత్రికఉన్నా అతని దృష్టిమాత్రం అక్కడ లేదు. అతడి మెదడు అనేక ఆలోచనల్తో నిండిపోయింది...తన వివాహంనాటినుండి నేటివరకూ జరిగిన తన జీవితాన్ని నెమరు వేసుకుంటున్నాడతను.

'ఎంతసే పయిందండీ వచ్చి?'

ఆకస్మికంగా చెవినిపడిన యీ మధుర ధ్వని అతని ఆలోచనల్ని అరికట్టి వాస్తవిక ప్రపంచానికి తెచ్చింది.

తలయెత్తి చూశాడు—సీత!

సీత కంఠధ్వనిని పసిగట్టిన ముసలమ్మ 'ఎక్కడి కెళ్లావే?' అని మళ్లీ దీర్ఘం తీసింది.

'దొడ్డికి వెళ్లొస్తున్నా మామ్మా!' అని ఆవిడకు సమాధానంచెప్పి, 'లేవండి, వడ్డిస్తున్నా' అని భర్తను హెచ్చరించి వంటింట్లోకి అదృశ్యమయింది సీత.

నారాయణ తన ఆలోచనల్ని మధ్యలో వదిలేయడం యిష్టంలేనట్లుగా అదేవిధంగా ఉండిపోయాడు.

నాలుగైదు నిమిషాలు గడచినయ్...

'వడ్డించా...రారేం?..మిమ్మల్నే!'...

బద్ధకంగా వళ్లు విరుచుకుని, మందంగా లేచి వంటయింట్లో ప్రవేశించాడు. అప్పుడే వెండి పళ్లెంలో అన్నం వడ్డించింది సీత.... నోరు మెదపకుండా పీటమీద చతికిల పడ్డాడు...

'ఇన్ని వేశావేం? ఒక్కసారి'

'ఏం?' అన్నది సీత విసనకఱ్ఱతో పొగలువచ్చే అన్నాన్ని విసురుతూ......

'వీటిల్లో యేది కలుపుకోవాలి ముందు?' నారాయణ మళ్ళీ ప్రశ్నించాడు.

'మీ యిష్టం...' అంతకంటె మంచి సమాధానం దొరకలేదు, సీతకు.

సీత 'ముఖభావం' నారాయణకు కోపం తెచ్చిపెట్టింది.

'అవున్లే...అన్నీ ఒక్కసారే వేసేస్తే మళ్ళీ లేవకుండా హాయిగా కూచో వచ్చు కదా అని.'

'అవును...హాయిగా కూచుందా మనుకుంటే మీరు-' అంతవరకూ అని నాలిక కొరుక్కుంది సీత.

వాక్యం అసంపూర్తిగా వదలినా, దాని భావాన్ని గ్రహించడానికి నారాయణ కేమీ కష్టం కలుగలేదు.

'అట్లాగైతే నా కింకా యేమీ అక్కర్లేదు. పో...పోయి పడుకో' అనిమాత్రం అనేసి, మెదలకుండా కూర కలుపుకున్నాడు.

సీతకు మాటలు దొరకలేదేమో-మాట్లాడకుండా నెయ్యివేసేసి 'ఇంకా కొంచెం కూర వేసేదా?' అని అడిగింది.

'అక్కర్లేదు' ఖచ్చితంగా-కఠినంగా-సమాధాన మిచ్చాడు నారాయణ. సీత కర్థమైంది-భర్తకు కోపం రానేవచ్చిందని. నెమ్మదిగా కూరముక్కలు వడ్డించింది....

'నువ్వికక్కడ్నుంచి పోతేగాని నేను అన్నం తినను.' భీష్మించాడతను. సీత మెదలకుండా లేచి మధ్యయింట్లోకి వెళ్లి చాప పఱచుకుని దిండు వేసుకుని పడుకుంది.

చాప పఱచిన చప్పుడూ-దిండు మోతా నారాయణ విన్నాడు. అందులోని విసురూ - కాఠిన్యతా అతనికోపాగ్నిలో ఆజ్యంపోశాయి. ఒళ్లు మండిపోతూంది దతనికి. మళ్ళీ ఆలోచనల్లో పడ్డాడు...తింటూనే ఆలోచిస్తున్నాడు. ఎంత నిర్లక్ష్యం వెళ్లమనగానే వెళ్లటమే? తనకేంకావాలో అని అక్కడ కూచోనక్కర్లేదా? ఒక్క మాట అనగానే అంత అహంకారమా! స్త్రీకి యెంత ఓర్పూ అణకువా వుండాలి? తన భర్త అంటేనే అంత రోషమా! మనిషంటే లెక్క చేయకపోతే?.....ఎంత నిర్లక్ష్యం! ఎంత అహంకారం!! ఎంత పొగరు!!! ఛీ! దాని మొహం చూడరాదు యిక!...తన కాళ్లముందు పడేలా చేయాలి...

అంతులేని ఆలోచనలతో అతని బుఱ్ఱ వేడెక్కుతూంది. అన్నం రుచిలేకుండా పోయింది...వంకాయపచ్చడీ విసుగ్గా కలుపుకుని నెయ్యి నాలుగు గరిటెలు వేసుకుని కళ్లుమూసుకుని ముద్ద నోట్లో పెట్టుకుని గట్టిగా నిట్టూర్చాడు.

"పచ్చడి కావాలా?"

ప్రక్కకు చూశాడు - సీత గడపమీద కూచుని ఉంది.

"అక్కర్లేదు...మజ్జిగ పోయ్..."

'కొంచెం అన్నం పెట్నా...'

'ఒద్దు...' చాల కఠినంగాఉంది జవాబు.

మెదలకుండా లేచివెళ్లి అన్నంపళ్ళెం తెచ్చి వడ్డించింది సీత.

'ఒద్దంటె యెందుకూ పెట్టావ్?' అన్నాడు—పళ్లు కొరుకుతూ!

'తినటానికి'—లక్ష్యంలేని జవాబు!

'పళ్లెం తీసుకురా...కొంచెం తీయాలి.'

ఆమె పళ్లెం తేవడమూ - అతడు రెండు కరుళ్లుతీసి అందులో పెట్టడమూ జరిగినప్పుడు అతని హృదయంలోని తుఫాను అంతా యింతా కాదు!

భోజనానంతరం జేవురించిన మొహంతో వచ్చాడు మధ్యయింట్లోకి. చాపమీద నడుము వాల్చినా ఆలోచనలు అతణ్ణి వదల్లేదు...

అన్నిపనులూ తెమల్చుకోని సీత మధ్యయింట్లోకి వచ్చి పెట్టెతెఱచి వక్కపలుకూ లవంగమూ తీసి భర్తకు యివ్వబోయింది. అతను చూడనట్లు నటించాడు. చేయి

యింకా ముందుకు జాపి 'పక్క పలుకు' అంది.

'నా కొద్దు' అన్నాడు నారాయణ ఖచ్చితంగా.

సీత మాట్లాడకుండా అవి క్రింద పెట్టి వెళ్లిపోయింది. కొంచెంసేపు తటపటాయించి వాటినితీసి నోట్లో వేసుకున్నాడతను.

ఆలోచిస్తూ పడుకుంటే నిద్రపట్టింది... లేచేసరికి మూడు కొసస్తున్నది. ఆదరాబాదరా లేచి ఆఫీసుకు పరుగెత్తాడు నారాయణ.

ఆనాడు సాయంకాలం యింటికి చాల ఆలస్యంగా వచ్చాడు. ఆఫీసు అయిదింటికి వదలినా, బజార్లో కాసేపూ—పార్కులో కొంతసేపు కాలంగడిపి యేడుగంటలకు రేడియోవార్తలుకూడా విని, యేడున్నరకు యింటికిచేరాడు. ఇంటికి వచ్చేటప్పుడే మనసు దృఢపఱచుకున్నాడు— 'తాను సీతతో మాట్లాడకూడదు - ఎంత బ్రతిమాలినా సరే!' అని దృఢనిశ్చయంతో యింట్లో అడుగు పెట్టాడు.

ఏమీ మాట్లాడకుండా డ్రస్ విప్పేసుకుని తువాలు కట్టుకుని స్రాసరి దొడ్లో బావిదగ్గఱకు వెళ్లాడు. అదేసమయంలో సీత దొడ్లో ప్రక్కింటావిడతో మాట్లాడుతూ కూచుంది. భర్త బావిదగ్గఱకు వెళ్లటంచూసి వెంటనే లేచి వంటయింట్లో పొయ్యిమీదఉన్న వేన్నీళ్లకాగును పట్టి తీసుకెళ్లింది బావిదగ్గఱకు త్వరగా... కాని, అప్పటికే నారాయణ రెండుచేదలు చన్నీళ్లే తోడుకుని పోసుకున్నాడు. సీత వేన్నీళ్లు బిందెలో పోసి...'వేన్నీళ్లుంటే చన్నీళ్లుచేస్తారేం?' అంది బొక్కెనకోసం చేయి జాపి. నారాయణ సమాధానమివ్వకుండా బొక్కెన బావిలో వేశాడు. సీత అతనికి దగ్గఱగా వెళ్లి చేతిలోని చేంతాడు లాక్కుని, రెండుచేదలు తోడి బిందెలోపోసి 'వేన్నీళ్లు పోసుకోండి' అని వంటింట్లోకి వెళ్లిపోయింది.

కాని ఆ మాటలు నారాయణకు వినపడలేదు...అతను వినిపించుకోలేదు. మామూలుగా—యేమీ యెఱుగనట్లే—చన్నీళ్లు తోడిపోసుకుని, తువ్వాలుతో ఒళ్లు తుడుచుకొని, ఒక బొక్కెడు నీళ్లల్లో వాటిని తడిపి-పిండుకొని దణ్ణెంమీద ఆరేసి యింట్లోకివెళ్లి ధోవతి కట్టుకున్నాడు...

మామ్మ మడికట్టుకుంటున్నది ... సీత పీటలు వేసి మంచినీళ్లు పెడ్తున్నది...చెల్లెలూ తమ్ముడూ చదువుకుంటున్నారు...నారాయణ యివన్నీ చూడకుండా వీథిలోకి వెళ్లి అరుగుమీద అటూయిటూ పచార్లు సాగించాడు.

చంద్రోదయం కాలేదింకా...నక్షత్రాలు ఆకాశంలో అల్లుకుపోయి విచిత్రమైన ముగ్గుల్ని ప్రదర్శిస్తున్నయ్. చల్లని పిల్లగాలి హాయిగా వీస్తున్నది...కాని నారా



యణకు యివన్నీ కనపట్టంలేదు. అత నేదో అతి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు...

స్త్రీలని అదుపులో ఉంచాలి. లేకపోతే లాభంలేదు. నెత్తికి యెక్కి తీరుతారు. వాళ్లు చెప్పినట్లు చేయాల్సివస్తుంది. అంటే మనం వట్టి దద్దమ్మలం కావాల్సివస్తుం దన్న మాట. వాళ్లకు చనువిస్తే అంతే! అందుకనే ఆడవాళ్లతో కోపంగా అదిలిస్తూ, విదిలిస్తూ, యీసడిస్తూ మాట్లాడాలి! కోపంగా ఉండాలి యింట్లో — యెప్పుడూ నవ్వకూడదు వాళ్లముందు. నవ్వామా యిక లాభం లేదు! నెమ్మదిగా మనల్ని బుట్టలో నే వేసుకుంటారు! కబుర్లతో — క్రీగంటి చూపులతో — చిరునవ్వులతో దగ్గరకు చేరుతారు! కోపంగా ఉన్నట్లు నటిస్తే అసలు అంత చనువుగా రానేరారు! భయపడుతూ భయపడుతూ మనం చెప్పినదల్లా విని అదుపాజ్ఞల్లో ఉంటారు...అందుకనే గామాల్ను నాన్న అమ్మతో యెప్పుడూ కరకుగా కసురుతో మాట్లాడ్తారు!!...

'వడ్డించా...' నారాయణ యీ మాటలు వినిపించుకోలేదు.

'మిమ్మల్నే!......అన్నానికి రాండి.' నారాయణ వినిపించుకోదలచలేదు. అట్లాగే ఆకాశంవంక చూస్తో నిలబడ్డాడు.

సీత యింకాదగ్గరగావచ్చి 'మిమ్మల్నే!' అన్నది....

'ఆ!' అన్నాడు అప్రయత్నంగా ...

'అన్నానికి రమ్మంటున్నా...' అన్నది సీత - ప్రాధేయపడుతూ - దీనంగా...

'...ఊ....' అనిమాత్రం అని యింట్లోకి వెళ్ళాడు.

వంటయింట్లోకి వెళ్లి మెదలకుండా పీట మీద కూర్చుని తలకాయ వంచుకొని 'అపోసన' పట్టాడు...

వంకాయకూర కలుపుకుని నెయ్యి వెయ్యకుండానే తినటం ప్రారంభించాడు. ...సీత అంటుచెయ్యి కడుక్కుని నెయ్యి వేస్తుంటే 'వద్దు నాకు' అని అరిచాడు... ఆ అరుపుకు మామ్మ తలకాయెత్తి చూసి 'ఏమిట్రా...' అన్నది...అతను మాట్లాడలేదు.

సీత మెదలకుండా రెండు గరిటెలు నెయ్యవేసి 'నెయ్యి వద్దంటున్నారు, మామ్మా!' అన్నది.

'ఏంరా? పిచ్చికొయ్యా! నెయ్యివద్దంటం యేమిట్రా!...'

'వద్దంటుంటే యెందుకు వేయాలి?' అతను అన్నాడు - కాదు - అరిచాడు.

'నెయ్యి లేకుండా నాకు ఒక్క మెతుకైనా దిగదు!...ఏమైనా వద్దనవచ్చుగానీ నెయ్యి వద్దనేవాళ్లెవర్రా!'

'వారికి కోపం వచ్చిందిలే, మామ్మా... నువ్వుకానీ....' అనేసి నాలిక కరుచుకుంది సీత......

'మజ్జిగ పోయ్!...' తలకాయ వంచుకునే అడిగాడు నారాయణ.

'అదేమిటీ! కూరంతా పారేశారు... పచ్చడి అసలు ముట్టుకోనేలేదు...చారు పెట్టాను...'

'మజ్జిగపొయ్యి!...' అదే స్వరంలో యింకా కటువుగా యీసారి...సీత చిన్నబోయింది...అట్లాగే చూస్తూనిలబడింది....

'పోస్తావా? లేచి పొమ్మన్నావా?'

అంతపనీ చేసేపట్టుదల ఉన్నదని సీతకు తెలుసు. అయినా ఆమె సహించలేకపోయింది యిది - కోపం తనమీదవస్తే రావచ్చు...అన్నం సరిగా తినకపోవటం.. ఆమె హృదయానికి బాధాకరంగా తోచింది....

'చారన్నా పోసుకోరూ?' అతి దీనంగా వేడుకొన్నది ఆమె. అతను మాట్లాడలేదు.

'కొబ్బరి పచ్చడి - '

'మజ్జిగ పొయ్యమన్నాను' సగంలోనే అందుకున్నాడు....

ఆ స్వరంలోని కాఠిన్యానికి సీత నిశ్చేష్టురాలయింది...ఇక లాభం లేదనుకుని మజ్జిగ పోసింది...

అతను రెండుమూడుసార్లు జారి లేచిపోయాడు...

'ఇవిగో నీళ్లు -' అనే సీతమాటలను వినకుండానే దొడ్లోకివెళ్లి బిందెలోని నీళ్లు ముంచుకుని కడుక్కున్నాడు...

'దొడ్లో చీకటి...' అంటూ సీత లాంతరు తెచ్చేలోగానే చెయ్యి కడు



వచ్చాని వచ్చేశాడు...ముందు గదిలోనికి వచ్చి కుర్చీలో మేను వాల్చాడు...

పిల్లలు చదువుకుంటున్నారు...

'క్రోధోన్మత్తుడు' అంటే యేమిటి అన్నయ్యా?' అని అడిగాడు తమ్ముడు...

'నోర్మూయ్!' అని అరిచాడు చదువుకునే వాళ్లు అదిరిపోయేట్లు! మళ్లీ వీధి అరుగుమీద చేరి పచార్లు సాగించాడు...

మామ్మ భోజనం అయింది. 'నా పక్క బట్టలేవే, అమ్మా?' అంటూ దీర్ఘాలుతీస్తూ పంచలోకి వచ్చింది....

'వస్తున్నా, మామ్మా' అంటూ సీతవచ్చి మంచంవాల్చి పక్క వేసింది. పిల్లల క్కూడా పక్క వేసి తమ పక్కకూడా వేసేసి వీధిలోకివచ్చి చూసింది...భర్త దగ్గరకు వెళ్లి 'పక్క వేశా...' అని చెప్పి యింట్లోకి వెళ్లింది...

కంచంముందు కూచున్నది భోజనానికి.. వేసిన కూర సగమైనా తరగలేదు. కొబ్బరి పచ్చడి అంతా అట్లాగే ఉన్నది....అన్నం చాలా మిగిలింది...చారు అసలు పోసుకోనే లేదు! ఏం తిన్నట్లు?...తనమీద అంత కోపం యెందుకు రావాలి? తనేం చేసిందని? కళ్లవెంట కారే నీళ్లు తుడుచుకుని గంకు చేతుకు తెంగిలిపడి త్వరగా పని ముగించుకుని యివతలి యింట్లోకి వచ్చింది....

పగలంతా పనిచేసిన చీర విప్పేసి ఉతికిన తెల్లచీరె కట్టుకుంది...మొహం కడుక్కొని బొట్టు పెట్టుకున్నది...హిమాలయా బూకే పౌడర్ అద్దుకుని అద్దంలో ఒకసారి ప్రతిబింబం చూసుకుని వాకిటి తలుపు గడియ వేసివచ్చి పెట్టెలోని వక్కపలుకూ లవంగమూ తీసికొని గదిలో ప్రవేశించింది. ఒక్కక్షణం అలాగే నిలబడిపోయింది...

తను వేసిన పక్క తీసేసిఉన్నది...వేరే ఒక 'జంపఖానా' పరుచుకొని భర్త పడుకొని ఉన్నాడు!...

నెమ్మదిగా దగ్గరకు వెళ్లింది...పక్కనే కూర్చుని వక్కపలుకు నోట్లో పెట్టబోయింది.

అతను నోరుమూసుకుని నిద్రపోయినట్లు నటిస్తున్నాడని తనకు తెలుసు...వక్కపలుకు నోట్లో పెట్టింది....

విసురుగా అవతలకు నెట్టాడు ఆమె చేతిని...వక్క కాస్తా యెక్కడోపోయి పడింది...

ఆమె ఖిన్నురాలయింది...అతని గడ్డం పుచ్చుకుని అన్నది....

'ఎందు కంత కోపం?'

అతను మాట్లాడలేదు....

'చెప్పరూ?......నేనేం చేశాను?' దీనంగా ప్రార్థించింది సీత అతని ఒడిలో తలదూర్చటానికి ప్రయత్నిస్తూ...

అతను యేమీ మాట్లాడకుండా నెమ్మదిగా అటుతిరిగి పడుకున్నాడు...

అతని మొహంమీద ఆనించి ప్రాధేయపడింది...'నేనేం తప్పు చేశానో చెప్పరూ?...'

అతను కళ్లుమూసుకునే అన్నాడు-'వెళ్లు యిక్కణ్ణించి.'

'ఎక్కడికి వెళ్తాను? మీ దగ్గిర్నించి?' అతని చెక్కిళ్లను అరచేతుల్తో రాస్తూ అన్నది, సీత.

'పో-ముందు......లే-యిక్కడ!' చేతుల్ని ఆమడదూరం పారేసినట్లు తోసేశాడు...'నాతో నీకు పనిలేదు!'

నిశ్చేష్టురాలయింది సీత...తన భర్తతో తనకు పనిలేదు?...

కళ్లవెంట అశ్రువులు గిర్రున తిరిగి ముత్యాల్లా మెరుస్తూ చెక్కిళ్లవెంట జారి అతని చెంపమీద టపీమని పడ్డాయ్-ఆకాశంనుండి గంగ శివుని శిరస్సుమీద దూకినట్లు...

నారాయణ గ్రహించాడు...తా నన్నమాట ఆమె హృదయాన్ని చీల్చివేసిందని గ్రహించాడు...అవి సీత అశ్రుధారలు!...

ఎవరినైతే తాను ప్రాణాధికంగా ప్రేమిస్తున్నాడో - ఎవరు తనకు సర్వస్వమూ అర్పించి తనమీద ఆశలు పెట్టుకున్నారో - ఆ ప్రేమదేవత కన్నీళ్లు కారుస్తున్నదని అతను తెలుసుకున్నాడు....ఆమె దుఃఖానికి కారణం యెవరు?...

ఈ ప్రశ్నకు సమాధానం వచ్చేందుకు అతని అభిమానం అడ్డు తగిలిందేమో!...

అవును! తానంటే లక్ష్యం లేనప్పుడు ఆమె కన్నీళ్లను తానెందుకు లక్ష్యపెట్టాలి?... స్త్రీలకు అలవాటేగా యీ కళ?

వాళ్ల కళ్లవెంట నీళ్లురాగానే మగవాళ్లు వెన్నపూసల్లాగా కరగిపోయి,సముదాయిస్తే యింకేమున్నది? దాసోహంఅన్నమాటేగా!

కన్నీళ్ళు ఆడవారికి బ్రహ్మాస్త్రం! తాను దానికి లొంగుతాడా? ఆలోచిస్తూ-నిద్రపోతున్నట్లు పడుకున్నాడతను...

ఈ నిర్లిప్త భావాన్ని సీత సహించలేకపోయింది...వెంటనే అతనిపై ఒరిగిపోయి అతని వక్షంలో తలదూర్చి గద్గదస్వరంతో ప్రాధేయపడింది...'నన్ను క్షమించరూ?..నాతో మాట్లాడరూ?' నారాయణ ఆలోచనలకు బ్రేక్ పడింది...అతనికి తెలియకుండానే అతని హృదయంలో కరుణరసం ఉద్భవిస్తున్నది...అతని కళ్లు చెమర్చినవి...అయినా అతని అభిమానం పూర్తిగా పోలేదు.

అనాదికాలంనుండీ పురుషుడు స్త్రీపట్ల ప్రవర్తించే విధానాన్ని నిర్దేశించే భావాలు కరుడుకట్టిన ఆ అనాగరిక భావాలే అతనిలో తిష్ఠవేసినయ్......కరుణరసాన్నీ, ప్రేమప్రవాహాన్నీ అడ్డి పైకిరాకుండా ఆపేస్తున్నయ్ అవి...

'నీవు ఇక్కడనుంచి వెళ్తావా వెళ్లవా?' నాతో నీకేమీ పనిలేదని చెప్పలా?' అతనిలో మిగిలిఉన్న కాఠిన్యాన్నంతా ప్రోగుచేసుకుని దూరంగా తోసేశాడామెను....

ప్రవాహం కట్టలు తెగిపోయినయ్... అణగిఉన్న అశ్రుధారలు అమాంతంగా ఉప్పొంగి అలలు అలలుగా ప్రవహించనారంభించినయ్...అట్లాగే వెక్కి వెక్కి యేడుస్తూ పడుకుంది సీత....

తానేం తప్పుచేసిందో తనకు తెలీదు... కాని దానికి కఠోరశిక్ష!...

తెల్లవారినది మొదలు ప్రొద్దుగూకేదాకా యింటి పనుల్లో-ఊపిరి పీల్చుకోటానిక్కూడా వీలూ, తీరికా లేనట్లుగా-ఒక యంత్రం పనిచేసినట్లు-బండచాకిరీ చేసి అలసిపోయి, రాత్రి విశ్రాంతిగా-హాయిగా భర్త ఒళ్లో పడుకుని-తానుపడే బాధలూ, యాతనలూ మఱచిపోయి-అతని ప్రేమపలుకుల తీయదనాన్ని రుచిచూస్తూ-అతని లాలింపులలో మైమఱచి పరవశత్వంతో-యీ ప్రపంచాన్నీ-కుళ్లు సమాజాన్నీ - తోడేళ్లవంటి మానవుల ఘాతుకత్వాల్నీ-అన్నిటినీ మఱచి - స్వర్గసీమల్లో విహరిద్దామని కోరుకుంటుంది స్త్రీ...పురుషుకు ఎన్ని బాధలు పెట్టినా అసమాన సహనంతో భరిస్తుంది స్త్రీ... పురుషుడి కోసం - పురుషుడి సుఖంకోసం - యెన్ని త్యాగాలన్నా చేస్తుంది స్త్రీ...కాని ఆమె వీటన్నిటికీ కోరే ప్రతిఫలం ఒక్కటే - భర్త హృదయం!...అతని చిరునవ్వు! తానూ అదేవిధంగా ఆశించింది...నిజానికి తాను పుట్టింట్లో అల్లారుముద్దుగా పెరిగింది; కాపురానికొచ్చేముందు తానూ తన భర్తా ఒక చక్కని చిన్నయింట్లో ఆదర్శ దాంపత్యపు ఆనంద డోలికల్లో ఉయ్యాల లూగుదామని కలలు కన్నది; కాని యీవిధంగా యింత పెనుభూతంలాంటి యిల్లూ...మనసుల్ని కలతలు పెట్టే మనుషులూ....చివరకు చీటికీ మాటికీ కోపపడి త్రోసివేసే భర్త ప్రవర్తనా...తన బ్రతుకెంత హాయంగా తయారయింది!...భర్తకే పనికిరానప్పుడింకా జీవించి యేం ప్రయోజనం?...

సీత వెక్కి వెక్కి యేడుస్తున్నది...నారాయణ నిద్రపోతున్నట్లు పడుకున్నాడు...కాని అతని హృదయం ద్రవించనారంభించింది.

'అనవసరంగా సీతను యేడిపిస్తున్నావ్!' పశువులాగా ప్రవర్తిస్తున్నావ్ హృదయం లేదూ? మనుష్యుడివి కాదూ?' అంతర్వాణి ముల్లుకర్రతో అతణ్ణి పొడుస్తున్నట్లుంది... ఇంతకీ సీతచేసిన తప్పేమిటి?' సూటిగా ప్రశ్నించింది అంతరాత్మ...

సమాధానం లేదు!...అవును సీత యేం చేసింది? తానే అనవసరంగా ఆమెను బాధించాడు...ఆమెచేసిన పొరబాటేమీ లేదు...లేనిపోని అభిమానంతో - పశుత్వాన్ని గుర్తుకుతెచ్చే నీచభావాలతో— అర్థంలేని కరుడుగట్టిన పురాతనపు పుచ్చు ఆలోచనలతో - హృదయం లేకుండా ప్రవర్తించాడు తను!...తనను సీత యెంత ప్రేమిస్తున్నదో తనకి తెలీదూ? అటువంటి తన సీత - తన కళ్ళముందు - దిక్కులేని దానిలాగా రోదిస్తూంటే శిలావిగ్రహంలా చూస్తూ ఊరుకుంటున్నాడు తాను. 'ఛీ! పశువా!...నీ హృదయంలో ప్రకాశించే ప్రేమజ్యోతిని చూడు! ఆకాంతిలో సీత మూర్తిని తిలకించు! ఆమెను ఆరాధించు! ఆమె నీ దేవతా మూర్తి!...'

నారాయణ కళ్లు చెమర్చినయ్...అశ్రుధారలు అంతులేకుండా ప్రవహిస్తున్నయ్.. ఇక ఉండలేకపోయాడు.

వెంటనే లేచి సీతదగ్గిఱకి వెళ్ళాడు... కింద - చాపయినా లేకుండా - పడుకుని ఉన్నది సీత...కూచున్నాడు...తొడమీద సీత తల ఉంచుకొని ముంగుర్లు చేత్తో సర్దుతూ 'సీతా!...నన్ను క్షమించవ్?' అన్నాడు కద్గదస్వరంతో. కళ్లు తెఱిచింది సీత..భర్త కళ్లల్లో చూసింది...నీళ్లతో తడిసిపోయిన అతని కళ్లను తుడిచింది—చిరునవ్వుతో!

'నన్ను క్షమించవ్! సీతా?' మళ్లీ అదే ప్రశ్న వేశాడతను!

'తప్పు! మీరే నన్ను క్షమించాలి!' అంది సీత. అతని వక్షంలో మొహం దాచుకుంటూ!

'సీతా!......నా హృదయాధిదేవతా!' అన్నాడు నారాయణ ఆమె నుదురును పెదవులతో చుంబిస్తూ!

చీకట్లు విరజిమ్మే ఆకాశంలో అప్పుడే చంద్రోదయమైంది...... ★

## సెక్సు విజ్ఞానం

(9 వ-పేజీ తరువాయి)

"వారి ప్రేమ వేరు. నా ప్రేమ వేరు. ఒక్క విషయానికి నిజం చెప్పు పోనీ. నీ భర్త ఏజబ్బుచేతైనా బాధపడుతున్నాడా?"

"లేదు. అధమం ఆయనకు నీలాటి కామజ్వరం కూడ రాలేదు."

"ఏం కోరిక లేకుండానే నువ్వు నావేపు రోజూ అదోలా చూస్తూన్నావా? మా సాహిత్యాల సిద్ధాంతం ప్రకారం నీభర్తలో ఏదో లోపం ఉండి తీరాలి. అదే నువ్వు దాస్తున్నావ్. దీనివల్ల నా ఒక్కడికే కాకుండ సాహిత్యానికే అవమానం తల పెడదామని చూస్తున్నావ్. నేను వూరుకొన్నా మా సాహిత్యం క్షమించదు. పోనీ దీనికేనా నిజం చెప్పు. నీ భర్తకేమైనా అంగలోపముందా?"

"ఏమిటీ వాగుడు. నిక్షేపంలా అతడు ఉద్యోగం చేసుకుంటూ ఉంటే మధ్య నీపోరేమిటి? నీవేపు చూసినంతమాత్రాన్న నిన్ను ప్రేమించినట్లే? ఆదిలో నీ వెకిలి చూపులు చూసేను. తరువాత పిచ్చిగా తయారయ్యావ్. నీకు బుద్ధి చెబుదామని చాలా రోజులపట్టి అనుకొన్నాను. యింకా వాగేవంటే దొంగవని పోలీసులకో, పిచ్చివాడవని పిచ్చి ఆసుపత్రికో ఒప్పచెబుతా"అన్నది తీక్షణంగా.

"శ్రీలక్ష్మి మన మిద్దరమూ బాల్యమిత్రులము, తెలుసా?"

"అందుకనే ముందుగా నెమ్మదిగా చెప్పేను. హద్దు మీరితే—"

"శ్రీలక్ష్మి నిన్ను నేను ప్రేమిస్తున్నా?"

"మళ్లీ మొదటి కొస్తున్నావ్. పెళ్లిఅయి భర్తతోనున్న నన్ను ప్రేమించట మేమిటయ్యా! త్వరలో నేను మాతృస్థానం కూడ పొందగలుగుతున్నాను. ఇంక వెళ్ళు. మరెప్పుడూ అన్యస్త్రీ వేపు చూడకు. వెళతావా? వెళ్లవా?"అని అడిగింది తీక్షణంగా.

సీను ఒక అడుగువైన వేస్తూ "సెక్సు కథలు నీవు చదవలేదూ" అని అడిగేడు జాలిగా.

"ఇంతవరకూ ఆ గ్రహచారం రాలేదు"

"మా సాహిత్యం?"

"అదీ, నువ్వూ కలిసి గంగలో పడండి. ఎవడికొక్కవాలి. ఇకనైనా వెళతావా? దేహశుద్ధి కావాలా?"

ఆ రాత్రి సీను కల గంటాడు. కలలో పెద్ద సుడిగాలి వీస్తుంది. తన టేబిలుమీద నున్న సెక్సు పత్రికలన్నీ ఎగిరిపోతాయ్. వాటిని ఏరితేవడానికి వాటితోపాటు పరుగెడతాడు. కాగితాలు ఎక్కడ వాల్తే తనూ అక్కడ వాల్తాడు. శ్రమతో ఒళ్లంతా నొప్పిపుడుతుంది. ఈ విధంగా ఆరాత్రంతా బాధపడతాడు. చివర కవి మునిసిపలు చెత్త డబ్బాలో శరణు పొందుతాయి. ★



శ్రీ అంబాళ్ అండు కంపెని,
తపాలు పెట్టె నెం. 8. మదరాసు.